# పరివర్తన

రచన:
డి. సుధారాణి

తెలంగాణాలో ఒక వూరు. ఆ వూరు మరీ అంత పెద్దదీ కాదు. అట్లని వాలుగుడిసెలు గలంత చిన్నదీ కాదు. ఓ మోస్తరుగా వుంటుంది. రాజకీయ నాయకుల పుణ్యమా అంటూ దిగుబడి జరిపిన పార్టీలు, మతాలు ఆ వూళ్లో వున్నాయి. అన్ని వూళ్ళలో లాగానే ఓ గ్రామ పంచాయతి. మురికినీటి గుంటలు, ఓ చావడి, ఓ మదరసా గుడిసె, ఓ కల్లు దుకాణం ఎగుడు దిగుడు త్రోవలు, దోమలు ఈగలు...అన్నీ వున్నాయి.

సాధారణంగా పగలంతా కష్టపడి పనిచేసేవాళ్లు మునిమాపు వేళ చాలామంది కల్లు దుకాణం చేరుతారు. ఊర్లోని విషయాలు, ఎవరు ఎలాంటి వారో ఎవతె ఎవరితో లేచిపోయిందో అనే విషయాలనుండి ఎవరు ప్రధాన మంత్రి; వరకు కబుర్లు సాగుతాయి. బుడ్లు తరుగుతాయి. త్రాగినవాళ్లు కొంతమంది తూలుతూ తుళ్ళుతూ యింటి ముఖం పడతారు. లేని వాదం పెట్టుకుని భార్యని ముక్కలిరుగ తంతారు. ఉన్న కుండలు పగ్గొడతారు.

'బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగలు' అనీ త్రాగినవాడు ఆ నిషాలో వాడేం చేస్తాడో వాడికే తెలియదు. త్రాగుడు మంచిది కాదని త్రాగే వాళ్ళకు తెలుసుకాని దాన్ని మానుకోలేరు. ఆ బాధంలో పడటం సులభం కాని పైకిరావడం చాలా కష్టము. అసలు వస్తువు లభించకపోతే దానిపై కోరిక వుండదు. ఒకవేళ కోరిక వున్నా...

జోగులు కల్లు దుకాణంలో అడుగు పెట్టాడు.

గల్లా పెట్టె దగ్గ కూర్చున్న నారయ్య విచిత్రంగా జోగులు వేపు చూశాడు. ఎందుకంటే గత అయిదు సంవత్సరాలుగా జోగులు ఎన్నడూ ఊరిలో అగపడలేదు.

"ఒరేయ్ జోగులూ! నీవట్రా! ఎటో ఎల్లిపోయినావు గదా? ఎప్పుడు వచ్చినావు. ఏదేశ తిరిగినావేటి?" అంటూ గటగట బుడ్డి ఖాళీ చేసి లేచాడు దానయ్య తాత.

జోగులు తలవంచుకుని మాట్లాడకుండా ఓ మూలకు వెళ్ళి కూచున్నాడు. జోగులు మాట్లాడక పోవడంతో దానయ్య "ఏందో! ఈ కాలపోళ్లు కట్టంవస్తే ఓర్చుకోలేరు. సుఖం వస్తే దాచుకోలేరు" అని గొణుక్కుంటూ బయటకు నడచాడు.

జోగులు కొంతసేపు కూచుని లేచి నారయ్య దగ్గరకు వచ్చి గల్లా పెట్టెపై పదిరూపాయల కాగితం విసిరాడు.

నారయ్య అవాక్కయి జోగుల్ని చూడసాగాడు.

"నా ముఖం మొంజూస్తావ్ ఇప్పించవోయ్ నేను దాగినన్ని బుడ్లు" విసుగ్గా పలికాడు జోగులు.

నారయ్య నౌకరు కుర్రాన్ని పిల్చి జోగులికి బుడ్లివ్వమని ఆదేశించాడు.

జోగులు వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు. కుర్రాడు సీసాలు తెచ్చి అతని ముందుంచి వెళ్ళిపోయాడు.

రాత్రి తొమ్మిది గంటలయి వుంటుంది. కల్లు పాకలో 'పెట్రోమాక్స్' వెలుగుతోంది. ప్రకాశవంతమైన కాంతులు పాకను దేదీప్యమానం జేస్తోన్నాయి. దానిచుట్టూ పురుగులు జేరాయి. దీప శిఖను మింగాలనే తపనలో చచ్చే పురుగులు చస్తున్నాయి. క్రొత్తవి వచ్చేవి వచ్చి చేరుతున్నాయి.

జోగులు సీసాపై సీసా పట్టిస్తున్నాడు. నిజంగా జోగులు త్రాగుబోతు కాడు. కొద్ది రోజులుగా ఏటో వెళ్ళి పోయిన జోగులు ఈ రోజే గ్రామం వచ్చాడు.

జోగులు కళ్లు త్రాగుడులో ఎర్రబడ్డాయి. అతని హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయి మైకం రక్తనాళాల్లో చేరి గల్లంతు చేస్తోంది అతన్ని కోపాన్ని అణచుకోలేక పోతున్నాడు.

చివరి సీసాను పూర్తిచేసి విసిరి గోడకొట్టాడు. అంగీ చేతితో మూతి తుడుచుకు లేచి నిలబడి ఒక్కసారి మేనువిరచి అడుగులు తడబడ కల్లు పాకనుండి బయట పడ్డాడు.

పెరిగిన గడ్డం, తైల సంస్కారం లేని అతని తల రేగి ముఖంమీద పడుతోంది. మాసిపోయిన అంగీ అదే రంగులో ధోవతి అక్కడక్కడ చిరుగులు పడినాయి.

బయట కటిక చీకటి. గ్రామం అంతా సుషుప్తిలో మునిగిపోయింది. కీచురాళ్ళ 'గీ'లు వినిపిస్తున్నాయి. ఉండుండి కుక్కల అరుపులు చిన్నపిల్లల ఏడుపులు నిశ్శబ్దాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నాయి.

బయటకు వచ్చిన జోగులు తడబడే అడుగుల్ని బలంగా వేస్తూ తనలో తానే ఏదో గొణుక్కుంటూ ముందుకు సాగిపోయాడు.

• • •

సీతాలు జోగులు ఒకే తల్లి కడుపున పుట్టినవాళ్లు కాని, తండ్రులిద్దరు. సీతాలు పుట్టిన తర్వాత రెండేండ్లకే తండ్రి మరణించాడు. తల్లి సీతాలును తీసుకుని పుట్టిల్లు చేరుకుంది. తర్వాత రెండేండ్లకు జోగులు తండ్రి సీతాలు సహా సీతాలు తల్లిని 'పాటు' (మారుపెండ్లి) తెచ్చుకున్నాడు. సీతాలుకు ఎనిమిదవ ఏట తమ్ముడు జోగులు

పుట్టాడు. తన కొడుకు కాదని, జోగులు తండ్రి సీతాలుని ప్రేమతో చూడక చివరకు దగ్గరకు కూడా తీసుకునే వాడు కాదు. అందుకని చిన్నప్పటినుండి అంటే సీతాలుకి భయం కాని, భక్తిగాని లేకుండేది. ఎక్కువ బయటే గడిపేవాడు. దానితో సహవాసం చెడ్డదయింది. చెడు తిరుగుళ్ళు అలవాటయ్యాయి. జోగులుపై పెద్ద ప్రేమ కూడా లేకుండేది. పాలక పిత చనిపోతూ సీతాలుకు ఆస్తిలో భాగం కూడా ఎక్కువ ఇవ్వలేదు. ఉన్నదానిలో ఒక వంతు సీతాలుకు. మూడు వంతులు జోగులుకిచ్చాడు. వూళ్ళో ఉన్నంత వరకు యిద్దరికీ చదువులు చెప్పించాడు. ఇద్దరన్నదమ్ములకు పెండ్లిండ్లు చేసి ఎవరి సంసారాలు వారికి ఏర్పాటు చేశాడు.

సీతాలు చిన్నప్పటినుండి అదుపు ఆజ్ఞలు లేకుండా పెరగటంతో జులాయితనం అతనిలో ఎక్కువయింది. తినటం, త్రాగటం జూదమే కాకుండా కనబడిన స్త్రీ వెంటల్లా పడి పోయేవాడు.

తల్లి బలవంతముపై సీతాలుకి రత్తికి మనువు కుదిరింది. ఏదో పెండ్లి అయిందనిపించాడు పాలకతండ్రి. క్రొత్త భార్య మోజులో సీతాలు చక్కగానే సంసారం సాగించాడు. భార్యపై మోజు తగ్గు ముఖం పట్టడంతో పాత గుణాలు అతన్ని చుట్టు ముట్టాయి.

తల్లి దండ్రి చచ్చిపోయారు. పాలకతండ్రి అతనికిచ్చిన ఆస్తి ఉండటానికో చిన్న పాక, చేసుకోవడానికి ఓ అరక చేను.

మొదట్నుండి తమ్మునిపై ప్రేమగాని ద్వేషంగాని లేకుండేది సీతాలుకు. కాని ఎప్పుడైతే ఆస్తి విషయంలో తనకు సరియైన వాటా రాలేదో అది మొదలు తమ్మునిపై కచ్చపట్టాడు. కనబడినచోటల్లా హేళన చేయడం పది మందిలో అవమానించడం, అప్పుడప్పుడు చేలవద్ద పోట్లాటలు కూడా జరిపించేవాడు.

జోగులు నెమ్మదస్తుడు. ఊరక ఎవరి జోలికి వెళ్లే వాడు కాదు. తండ్రి తనకెందుకంత ఆస్తి ఇచ్చిపోయాడో అర్థంకాలేదు. పైగా సీతాలుతో సమానంగా పంచుకుందా మనుకున్నా అతను ఒప్పుకోలేదు. అంతేగాక తన్ను అసహ్యంగా చూస్తుంటాడు. అయినా రక్తసంబంధంతో అన్నపై జోగులికి చెప్పలేని ప్రేమ వుంది. అందుకే తనను సీతాలు ఎంత అవమానపరచినా ఉలుకూ పలుకూ లేకుండా తప్పుకుపోయేవాడు.

వూరులో వారందరికి తలలో నాలుక. తన పనేదో తాను చూసుకుంటూ అందరితో కల్సివుండేవాడు జోగులు. తండ్రి కుదిర్చిన సంబంధమే మనువాడాడు. లచ్చి నిజంగా లక్ష్మిలాగే వుంటుంది. పిటపిటలాడే వొళ్లు కాంతి గల ముఖం, సుగుణాలరాశి, ఎప్పుడూ సంతోషంతో నిండి చిరునవ్వులు చిలకరిస్తూండే పెదవులు. ఇద్దరాలూ మగలు ఎంతో ముచ్చటగ వుండేవారు. ఆ జంటను చూసి వూరూ, వాడా చిలకా గోరింకల్లా వున్నారని చెప్పుకునేవారు.

అలాంటి జోగులు ఇలా మారాడంటే కారణం బలమైందే వున్నది. అదే అతన్ని జీవితంలో ఏకాకిని చేసింది. జీవచ్ఛవాన్నిగా మార్చింది అయిదు సంవత్సరాల క్రిందటి సంగతి యిది.

రెండు రోజుల క్రితం ధాన్యం నింపుకొని జోగులు నాలుగు బళ్ళపై పట్నం వెళ్ళి ధాన్యం అమ్మి మూడవ నాటి పగటి సమయానికి యింటికి వచ్చాడు. తన యింటి ముందు జనం గుమిగూడి వుండటం చూచి అతని ప్రాణాలు పైపైనే లేచిపోయినాయి. తన లచ్చికి ఏ కష్టం జరుగొద్దని తనకు తెల్సిన దేవుళ్ళందరికి పేరు పేరునా మొక్కుకున్నాడు.

బండి ఆగి ఆగక ముందే ఇంటిలోకి పరుగెత్తాడు. లచ్చి మంచంలో పడుకుని వుంది. కళ్ళు మూసి వున్నాయి. మంచం చుట్టూ ఆడవాళ్లు చాలామందే నిలిచి వున్నారు. మగవారంతా వసారాలో నిలిచి చర్చించుకుంటున్నారు.

“చెప్పండి! నా లచ్చికి ఏమయింది? ఏం జరిగింది?? లచ్చీ!!” అంటూ బిగ్గరగా అరచాడు.

మంచం దగ్గర తలాపిన కూర్చున్న వదిన రత్తమ్మ “నాయనా! జోగువూ చెల్లెలు నిన్ననాయం చేసిపోతోంది. ఉదయంనుండి నిన్నే కలవరిస్తోంది. ఏదో మాయదారి జబ్బు... రామయ్య పంతులు ఎన్ని మందులిచ్చినా ఏం పని చెయ్యడంలేదు. లచ్చి నడిగితే, ఏం చెప్పడంలేదు. ప్రతిసారి నీవు వచ్చినావా? అంటూనే అడుగుతోంది.” అంటూ వ్యధతో చెప్పింది.

“లచ్చీ! నేను వచ్చాను. నా లచ్చీ! నన్నొదిలి పోతావా! నేనే నీవు అన్నావే! నిన్నడిచి ఈ ప్రపంచంలో నేనెలా బతికేది? లచ్చీ!” అంటూ ఆవేశంతో గొల్లుమన్నాడు.

లచ్చి మెల్లిగా కనురెప్పలు బరువుగా తెరిచి “బావా! వచ్చావా? నువ్వేనా?” అంది. ఆమె పెదాలు ఇంకేదో చెప్పాలని వణుకుతున్నాయి. చేత్తో అందర్నీ వెళ్ళి పొమ్మన్నట్లు సైగ జేసింది. అందరూ బయటకు నడిచారు.

లచ్చి మంచంపైన జోగులు కూర్చున్నాడు. జోగులు చేతిని లచ్చి తన చేతుల్లోకి తీసుకుని హృదయంపై నుంచుకుంది.

“లచ్చీ! ఏం జరిగింది? వెళ్ళేముందు నువ్వు మంచి

గానే వున్నావుగదూ! నువ్వు చెప్పిన నగలూ...బట్టలూ తెచ్చినాను. యింతలోకే ఏంటయ్యిందని చెప్పవూ!"

"వద్దు బావా! అది నేను చెప్పదలచుకోలేదు. బావా! నే వెళ్ళిపోతున్నాను. నన్ను మరిచిపోవుగదూ!! నా కోసం తెచ్చిన నగలూ, బట్టలూ, నా పేరుపై దానం చెయ్యి..." అంటూంటే ఆమె కళ్లు నీటితో నిండి ప్రక్కలకు ప్రవహించింది.

"లచ్చీ! ఏం జరిగిందో చెప్పవూ!! నాపై నీవు చూపే ప్రేమయిదేనా!! నా లచ్చి కదూ! చెప్పు. నీవు చెప్పేది నీలోనే దాచుకుంటే మన యిద్దరం ఒకటేనని ఎట్టా అనిపిస్తది?"

"అవంతా ఎందుకు పోనియ్ బావా! ఎలాగు నేను బ్రతికేదిలేను."

"లేదు నువ్వు చెప్పి తీరాల్సిందే! లేకుంటే నాపైన ఒట్టే నీవు చెప్పకుంటే!"

"బావా! బలవంతం చేస్తుండావు. చెప్పటం మంచిది కాదు.

నువ్వు కోపానికి రానంటే చెబుతాను."

"లేదు. నువ్వే నాక్కాకుండా పోతున్నావు. ఇంకా నాకోపం ఎందుకు? చెప్పు!"

"ఉహుఁ! నా చేతిలో చెయివేసి చెప్పు ఎప్పుడు కోపానికి రానని" అంటూ ప్రేమతో పలికింది.

జోగులు ఆమె చేతిలో చేయి వేశాడు.

"బావా! నువ్ మొన్న పట్నం వెళ్ళిపోయావు. నిన్న పగటికాడ నేను చేలు చూట్టానికి వెళ్ళాను. అదే చేలో మీ అన్న కూడా వుంటే, నన్ను జూసి. "ఏందే మరదలా! నేను బావను గాదే!! నాకాడ సిగ్గేంటి? ఏం! పగటికాడ చేనులోకి వచ్చినావు? తమ్ముడు పట్నం ఎల్లిండుగదా అనా!!" అంటూ దగ్గరగా వచ్చిండు. అతనోట్నుండి గప్పున వాసన వచ్చింది. నేను ముక్కు మూసుకుని పరుగెత్తబోయాను అక్కడ్నుండి. కాని వెంటనే నా చేయిబట్టి నన్ను బలంగా కౌగలించుకున్నాడు. నేను పెనుగులాడాను.

జోగులులో ఉద్రేకం పొంగసాగింది. కాని లచ్చి అతని చేతిని దొరక బట్టుకుని వుంచింది.

"ఊఁ! చెప్పు...తర్వాత ఏం జరిగింది?" అంటూ హుంకరించాడు జోగులు.

"ఏం జరిగిందిబావా! ఏ ఆడదానికి జరగని అవమానం జరిగింది...నా మానం కాపాడుకోలేక పోయినాను. బావా!!...బావా!!! నేను వెళ్ళిపోతున్నాను...నా శరీరాన్ని...నీ కివ్వలేక...నే...ను...మంచు...తి..." పూర్తి చెయ్యకుండానే లచ్చి ప్రాణాలు వదిలింది.

జోగులు "లచ్చీ!" అంటూ మీదపడి ఏడ్వసాగాడు. జుట్టు పీక్కున్నాడు. తలబాదుకున్నాడు మంచానికి. లచ్చి నిశ్చలంగా వుండిపోయింది. జోగులు అనుపులు అందరూ లోపలికి వచ్చారు.

దహనం జరిగింది. జోగులు పిచ్చివాడయ్యాడు. నిద్రాహారాలు మానుకున్నాడు. ఓనాటి రాత్రి వూరు కూడా వదిలిపోయాడు ఎవరికి చెప్పకుండా...

* * *

చుట్టుతా చీకటి చలికాలం ప్రవేశించిందేమో! వాతావరణం చల్లగా వుంది. అంత చీకటిలో అడుగులు తడబడుతూండ జోగులు తూలుతూ నడుస్తున్నాడు. కాలికింద ఏదో మెత్తగా తగిలింది. చలికి ముడుచుకు పడుకున్న 'కుక్క' తన తోకపై ఏదో బరువుపడి 'కుయ్యిఁ' మని ఇంకా దగ్గరకు ముడుచుకు పడుకుంది.

జోగులులో మత్తు ఎక్కువయింది. ఆకాశంలో చుక్కలు నిశ్చలంగా ప్రకాశిస్తూ చీకటిని తరిమివేసే ప్రయత్నం చేస్తున్నాయి.

జోగుల్లో అయిదు సంవత్సరాల క్రిందటి ప్రతీకారం నేడు పూరు చేసుకున్న తర్వాత విజృంభించింది. 'లచ్చి' జ్ఞాపకాల్ని మరవడానికే త్రాగుడుకు అలవాటుపడ్డాడు. లచ్చి మీదికి వచ్చినప్పుడల్లా అతనిలో పగసెగలు వేసేవి. కాని తను 'లచ్చి'కి చేసిన బాస మతికివచ్చి చల్లబడేవాడు.

నిండుగా త్రాగడంవల్ల అతనిలో ప్రతీకారం తప్ప వరో దానికి స్థానం లేకుండా పోయింది.

అడుగులు అపసవ్యంగా పడుతూండ గుడిసెముందు నిలచి, తడిక నెట్టి, లోన ప్రవేశించాడు జోగులు. కొడిగుడ్డు దీపం గుడ్డిగా వెలుతురును ప్రసాదిస్తూ గుడిసెలోని చీకటిని తరుముతోంది.

గుడ్డి వెలుగులో మూసుకుపోయే కనురెప్పల్ని బలంగా తెరచి మంచంలో నిదరబోతున్నా పీతాల్ని తీలగా చూశాడు.

కోపం చిందులు త్రొక్కింది. మంచాన్ని సమీపించి చేయిపైకెత్తాడు ..

కెవ్వున కేక వేసి ఒక్కదూకున మంచం దిగి జోగులు ఛాతిపై రెండు చేతులుంచి వెనక్కి నెట్టి ది రత్తా.

బాహ్యాన్ని మరచిన జోగులు దబాల్న వెనక్కి పడ్డాడు, జోగులుకు ఆ పాటుతో కొంత మత్తు వదిలింది. చుట్టూ తానెక్కడున్నది పరికించి మూసుకుపోయే కళ్ళను తెరచి చూశాడు...కళ్ళు మూసుకుపోతున్నాయి.

(సశేషం)